www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025
5
వైఎస్‌ఆర్



మానవ హక్కుల రక్షణ చట్టాలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రతి ఒక్కరూ మానవ హక్కుల పరిరక్షణ చట్టాల గురించి తెలుసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రప్ప అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా, నగర కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ షాబుద్దీన్, నగర అధ్యక్షులుగా ప్రసన్న కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుర్రప్ప, షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ షా మహమ్మద్, రాష్ట్ర అధ్యక్షులు అలీ షేక్, ఖాదిరుల్లా ఖాదిరి, నాయకులు నజీర్ అహ్మద్, డాక్టర్ నజీముద్దీన్, జన విజాన్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్‌ఎండి తాహిర్, జిలాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు మానవ హక్కుల రక్షణ చట్టాల గురించి తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బాధ్యులు, ఆ సంస్థ సలహాదారులు బషీర్ ఖుతరి, మహిళ అధ్యక్షులు ఆస్మాకిరణ్, రియాజ్, తారీఖ్, వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బెడెడ్ పెన్షనర్లకు డేంజర్‌బెల్



- 54,129 మందికి రీఅసెస్మెంట్ పరీక్షలు
- రేపటి నుంచి ఇంటింటికీ వైద్య బృందాలు
- పొరుగు జిల్లాల నుంచి మానసిక వైద్య నిపుణులు రాక

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బెడెడ్ పింఛనర్ల గుండెల్లో డేంజర్‌బెల్ మోగుతోంది. ఈ నెల 27 నుంచి కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 54,129 మంది బెడెడ్ పింఛనుదారులకు రీ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మానసిక వైద్య వికలత్వ నిర్ధారణ పరీక్షల నిమిత్తం నెల్లూరు, అనంతపురం, మదనపల్లి ప్రాంతాలకు చెందిన మానసిక వైద్య నిపుణులు పరీక్షల నిర్వహణకు రప్పించనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ముగింట కడప, అన్నమయ్య జిల్లాల్లో బెడెడ్ పింఛన్లపై చెలరేగిన వివాదాల నేపథ్యం వెరిఫికేషన్‌కు కారణమని తెలుస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో సుమారు 3,232 మంది పింఛనుదారులకు డిఆర్‌డిఎ అధికార యంత్రాంగాలు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం వైద్యబృందాలు వికలత్వ పరీక్షలను నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు పెన్షన్ మొత్తాన్ని తగ్గించుకోవాలని భావించింది. రాష్ట్ర వ్యాప్తంగా బెడెడ్ రోగుల వికలత్వ శాతాన్ని రీఅసెస్మెంట్ చేయాలనే ఆలోచన చేసింది. ఆరుగురితో మంత్రుల బృందాన్ని నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది బెడెడ్ పెన్షనర్స్ ఉన్నారని గుర్తించింది. వీరికి ప్రతి నెలా రూ.ఆరు వేల నుంచి రూ.10 వేల వరకు పెన్షన్ చెల్లిస్తోంది. బెడెడ్ పింఛనుదారుల్లోని వికలత్వశాతాన్ని రీఅసెస్మెంట్ చేయడం ద్వారా నిర్ధారించాలని నిర్ణయించింది. జోన్-7 పరిధిలోని కడప, అన్నమయ్య జిల్లాల్లో 54,129 మంది బెడెడ్ రోగులు ఉన్నట్లు గుర్తించింది. ఈ నెల 27 నుంచి హాస్పిటలైజ్ లోకి డాక్టర్ పేరుతో నడవలేని బెడెడ్ పింఛనుదారుల ఇంటికి వెళ్లి పరిశీలించనుంది. అంధులు, బధిరులు, మానసిక రోగులకు కడప జిజిహెచ్, పులివెందుల ఏరియా ఆస్పత్రి, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, బద్వేల్, మైదుకూరు, కమలాపురం సిహెచ్‌సి ఆస్పత్రుల్లో వైద్య నిర్ధారణ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. కడప జిల్లాలో నడవలేని పింఛనుదారులు 19,087 మంది, అన్నమయ్య జిల్లాలో 14,358 మంది వెరసి 33,445 మంది నడవలేని పింఛనుదారులు ఉన్నట్లు గుర్తించింది. అన్నమయ్య జిల్లాలో అంధుల పింఛనుదారులు 2,761, కడప జిల్లాలో 3,627 మంది వెరసి 6,388 మంది ఉన్నట్లు గుర్తించింది. కడప జిల్లాలో చెవిటి పింఛనుదారులు 14,179, మానసిక పింఛనుదారులు 9,505 మంది ఇంటింటికీ వెళ్లి వైద్య బృందాలు పరీక్షించనున్నాయి. మానసిక వైద్యనిర్ధారణ పరీక్షల నిర్వహణకు నెల్లూరు, అనంతపురం, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ప్రాంతాలకు చెందిన మానసిక వైద్యనిపుణులు పరీక్షించనున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఈ నెల 27 నుంచి మే నెలాఖరు నాటికి రీఅసెస్మెంట్ పరీక్షల నిర్వహణ ద్వారా వికలత్వ నిర్ధారణ ఫలితాలను వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం ప్రభుత్వ మంత్రుల బృందం సిఫార్సు మేరకు బెడెడ్ పింఛనుదారులకు వచ్చిన వికలత్వ శాతాన్ని బట్టి పెన్షన్‌లో కోత విధిస్తారా, లేక పెన్షన్ మొత్తాన్ని రద్దు చేస్తారా అనేది వేచిచూడాల్సి ఉంది.



పుల్లంపేటలో వికలత్వ పింఛనుదారును పరిశీలిస్తున్న సిబ్బంది

ఓటు సామాన్యుడి చేతిలో వజ్రాయుధం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రపంచంలోనే అతిపెద్దప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో ఓటు హక్కు ఓ వజ్రాయుధమని, తన ఓటు హక్కుతో దేశాన్ని శాసించగల శక్తి ఓటర్లందరికీ ఉందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిఒచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో పార్లమెంట్, అసెంబ్లీలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఎంతో విలువైన ఓటరుకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రజాస్వామ్య విలువలను చాటుకుంటూ ప్రపంచ దేశాలకు మన దేశం గీటు రాయిగా నిలిచిందన్నారు. అనేక మంది వారి స్వాతంత్ర్య సమరయోధులు తమ జీవితాలను త్యాగం చేసి భారతదేశానికి స్వాతంత్రాన్ని తీసుకొని వచ్చారని అన్నారు. స్వతంత్ర దేశంలో పౌరులందరికీ కుల, మత, భాష,లింగ, అక్షరాస్యులు, నిరక్షరాశులు, థర్డ్ జెండర్ అనే తారతమ్యాలు లేకుండా ప్రజాస్వామ్య బద్ధంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును రాజ్యాంగం ప్రసాదించిందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విలువైన ఓటును నమోదు చేసుకోవాలని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిష్పక్షపాతంగా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మన విధిగా బాధ్యతాయుతంగా వినియోగించుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జెసి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఎక్కడా లేని విధంగా రూ. 90 కోట్లకు పైగా ఓటర్ల తో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా బారతదేశం అవతరించిందన్నారు. జిల్లాలోని సీనియర్ ఓటర్లను పూల మాల,శాలువతో సన్మానించారు. ఎక్కువ శాతం నూతన ఓటర్లను నమోదు చేసిన సూపర్‌వైజర్, బిఎల్‌ఒలకు మెమోంటోలను ప్రదానం చేశారు. అంతకుముందు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని... జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ముద్ర అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, జిల్లా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** ఓటు దేశ భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవా కేంద్రం యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి యోగి వేమన విశ్వ విద్యాలయ కళాశాల అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **చెన్నూరు :** ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సరస్వతి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రభుత్వాలను ఎన్నుకోవాలన్నా అదే ప్రభుత్వాలను కూల్చివేయాలన్నా ఓటు ఎంతో ప్రాముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డిటి వెంకటరమణ, ఆర్‌ఐ కౌశిక్, ఎలక్షన్ డేటా ఆపరేటర్ శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ శివ, విఆర్‌ఒలు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల (కాశినాయన) :** గ్రామాలలో ప్రతి ఒక్కరు ఓటు విలువ తెలుసుకొని నడుచుకున్నప్పుడే రాష్ట్రం దేశం అభివృద్ధి చెందుతుందని పోరుమామిళ్ల మండలం రంగ సముద్రం పంచాయతీ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు తూపాకుల ప్రసాద్ పేర్కొన్నారు శనివారం మండల పరిధిలోని రంగసముద్రం పంచాయతీకి సంబంధించి 77వ పోలింగ్ స్టేషన్‌లో రాజేశ్వరి ఆధ్వర్యంలో బొజ్జ ఐజయ్య అనే ఓటరుకు పూలమాలవేసి సత్కరించారు. కార్యక్రమంలో రంగసముద్రం మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



నృత్యంలో అవార్డు అందుకున్న చిన్నారులతో కలెక్టర్, జెసి



సీనియర్ ఓటరును సన్మానిస్తున్న కలెక్టర్

సి.కె.నాయుడు ట్రోఫీ మ్యాచ్ ప్రారంభం

- మొదటి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకు ఆంధ్ర ఆలౌట్

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో శనివారం కల్నల్ సి.కె. నాయుడు ట్రోఫీ అండర్-23 మల్టీ డే స్టేట్ మ్యాచ్‌లో భాగంగా ఆంధ్ర, పంజాబ్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన పంజాబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 83.0 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఆంధ్ర జట్టులోని తేజ 157 బంతులను ఎదుర్కొని 8 బౌండరీల సహాయంతో 70 పరుగులు చేశాడు. ప్రసాద్ 27, రేవంత్ రెడ్డి 23 పరుగులు చేశారు. పంజాబ్ జట్టులోని క్రిష్ బగట్ 4, ఆర్యమన్ దలివాల్ 2, అభయ్ చౌదరి 2 వికెట్లు తీసుకున్నారు.



తలపడుతున్న ఆంధ్ర, పంజాబ్ జట్లు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

రాష్ట్రంలో పరిపాలన అనేదే లేదు : వైసిపి

ప్రజాశక్తి - కడప: రాష్ట్రంలో అసలు పరిపాలన అనేది ఎక్కడ కాన రాలేదని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఎక్కడ చూసినా మహిళలపై, దురాగతాలు, గంజాయి, పేకాట క్లబ్బుల పాలనే సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఇంతటి దుష్ట దుర్మార్గ పరిపాలన గతంలో ఎప్పుడు చూడలేదని అన్నారు. ప్రభుత్వం నుంచి రావాలసినవి వచ్చేంతవరకు ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. శనివారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో మట్టి నుంచి ఇసుక వరకూ దోచుకు తింటున్నారు అని పేర్కొన్నారు.దావోస్ విషయంలో జగ్ కి చేతకాలేదు అన్న చంద్రబాబు ఏమి తెచ్చారని ప్రశ్నించారు.దావోస్‌నే ఇక్కడకు తెస్తానంటూ ప్రగల్భాలు పలికారు అన్నారు. మైదుకూరు వ్యక్తికి కోటు వేసి చర్చలు జరుపుతున్నారని అన్నారు. ప్రజలందరికీ వీళ్ళ చేతగానితనం, మోసం అర్థం అవుతోంది అని చెప్పారు. విజయసాయిరెడ్డి లేని లోటు కచ్చితంగా ఉంటుంది అని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, నిత్యానంద రెడ్డి, పాకా సురేష్, త్యాగరాజు, కరీముల్లా పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : చంద్రబాబు కూటమి ప్రభుత్వం అమలు చేస్తామన్న 'సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫ్లాప్' అయ్యాయని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి అన్నారు. ఎన్నికల్లో చెప్పిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల ఆదేశాల మేరకు థాలీ భజావో కార్యక్రమం పేరిట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లేట్లు - స్పూన్లతో పెద్ద శబ్దం చేస్తూ మొద్దు నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిద్రలేపే కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి 227 రోజులు అయిందన్నారు. ఇప్పటివరకు సంక్షేమ పెన్షన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలను ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. కమిటీలతో, ప్రణాళికలతో కాలయాపన చేస్తున్నారన్నారు ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు ధ్రువ కుమార్ రెడ్డి, శివ మోహన్ రెడ్డి, ఇర్ఫాన్ భాష, అశోక్ రెడ్డి, అబ్దుల్ సత్తార్, మామిళ్ళ బాబు, మైనుద్దీన్ మూరతోటి విజయకుమార్, మహబూబ్ బాషా, శ్యామలమ్మ, గౌస్ పీర్, కదిరి ప్రసాద్ గౌడ్, కుళ్లాయప్ప, రఫీఖ్ ఖాన్, హమీద్, పీడీ సంజయకాంత, ఆసిఫ్ ఖాన్, హరిప్రసాద్, జహ్వార్, కమల్ బాష పాల్గొన్నారు.

అంగన్వాడీ పాఠశాలల అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి-కమలాపురం

కమలాపురం నగర పంచాయతీలోని 6, 9,11, కౌన్సిర్ పరిధిలోని అంగన్వాడీ పాఠశాలల అభివృద్ధికి భారతి సిమెంట్స్ పరిశ్రమ ముం దుకు రావడం - అభినందనీయం కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి కొని యాడారు. కమలాపురం నగర పంచాయతీలోని అంగన్వాడీ స్కూల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భారతి సిమెంట్స్ పరిశ్రమ అంగన్వాడీ స్కూల్ అభివ ృద్ధికి ముం దుకు రావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. అంతేకాకుండా స్వచ్ఛ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మిం చడానికి సహాయ సహకారాలు అందించాలని భారతి సిమెంట్ యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాఘవరెడ్డి, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్ బాషా, హాస్పిటల్ కమిటీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

ప్రజాశక్తి - కడప

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. శనివారం కడప బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ నంద్యాల చిన్నయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదులకు కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. మ్యాచ్‌లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో ఉన్న న్యాయవాదులకు కాస్త ఊరట ఇచ్చేందుకు కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ మ్యాచ్ లు నిర్వహించడం ఎంతో అభినందించదగ్గ విషయం అన్నారు. కార్యక్ర మంలో మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వర్లు. నాలుగవ అదనపు జిల్లా జడ్జి దీన బాబు, సబ్ కోర్టు జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్, అడిషనల్ సబ్ కోర్టు జడ్జి ప్రత్యూష కుమారి, రెండవ ఏడియం కోర్టు జడ్జి భార్గవి, ఎక్సైజ్ కోర్టు జడ్జి ఫేమస్ స్రవంతి, థర్డ్ ఏ డి ఎం విజయలక్ష్మి, మొబైల్ కోర్టు జడ్జి ఆశా ప్రియ, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్‌ఎస్‌ఎ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ నంద్యాల చిన్నయ్య, అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి



కియా సిరోస్ కారును ఆవిష్కరిస్తున్న అతిథులు

కియా సిరోస్ కారు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని చిన్నచౌకులో ఉన్న హోషి ఆటో ప్రయివేట్ లిమిటెడ్ కియా కార్ షోరూమ్‌లో శనివారం కియా సిరోస్ కారును ఆవిష్కరించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కియా సిరోస్ కారు అత్యాధునిక సదుపాయాలు కలిగి ఉందని పేర్కొన్నారు. 8 రంగులలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వివరాల కోసం షో రూమును, సెల్ నంబర్ 9100773485 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి. భారతి, హెూషిమా రెడ్డి, నూతన షో రూమ్ మేనేజర్ ఎన్ఎస్ ప్రవీణ్ కుమార్, కస్టమర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్‌ఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : డయల్ యువర్ ఆర్‌టిసి కార్యక్రమానికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని ఆర్‌ఎం గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్‌ఎంకు ప్రజల నుంచి ఆరు సమస్యలు అందాయి. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. సద్వినియోగం చేసుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాల ప్రమాద తీవ్రతపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్ : డ్రగ్ ఫ్రీ ఆంధ్ర ప్రదేశ్ సాధన కోసం యువత సమయాత్తమై ప్రజలకు అవగాహన కల్పించాలని వైవీయూ కె. కృష్ణారెడ్డి అన్నారు. యాంటీ డ్రగ్ యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించేందుకు వైవీయూ కళాశాల క్యాంపస్‌లో శనివారం ర్యాలీ నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ ప్రొ.కె. కృష్ణా రెడ్డి, రిజిస్ట్రార్, ప్రొ.పి. పద్మా , ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. కార్యక్రమంలో డ్రగ్ ఫ్రీ ఆంధ్ర ప్రదేశ్ నోడల్ అధికారులు డాక్టర్ ఎస్. శ్రీనివాస గౌడ్, డాక్టర్ ఎస్ సుమిత్ర, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకట రామిరెడ్డి, వివిధ విభాగాల అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్‌లు, రీసెర్చ్ స్కాలర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-కాశినాయన

గత ప్రభుత్వంలో సిపిఎస్, తదితర ఉద్యమాలలో పాల్గొన్న ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎస్‌టియు సిపిఎస్ కన్వీనర్ యు. సుబ్రమణ్యం డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛను పథకాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను తప్పు దారి పట్టించేవి అని పేర్కొన్నారు. ఆకలి మంటతో రోడ్డు ఎక్కితే వారి మీద గత ప్రభుత్వం అన్యాయంగా అక్రమ కేసులు బనాయించి మానసిక క్షోభకు గురి చేసిందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెంటనే ఎత్తివేయాలని కోరారు.

నూతన ఎస్‌పిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి కడప అర్బన్

ఎస్పి ఇ.జి.అశోక్ కుమార్‌ను టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్, మాజీ కార్పొరేటర్ సంఘం జాకీరుద్దీన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పోలీస్ సేవలు ప్రజలకు బాగా అందిస్తున్నారని తెలిపారు. జిల్లా, ప్రజలపైన అవగాహన, తెలిసిన వ్యక్తి ఎస్పిగా రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వసీమ్ పాల్గొన్నారు.

జీరో సర్వీస్‌తో ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

వేసవి సెలవులలో నిర్వహించబోవు ఉపాధ్యాయ బదిలీలను జీరో సర్వీస్ ప్రామాణికం తీసుకోవాలని ఎస్‌టియు ఎపి జిల్లా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్ రెడ్డి కోరారు. శనివారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కడప స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023, మే జూన్ నెలలో ఉద్యోగోన్నతలు చేపట్టడం, రాష్ట్రంలో నూతన జిల్లాలు ఏర్పడడం వల్ల చాలామంది సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యారన్నారు. ప్రస్తుతం డిఎస్‌సి ద్వారా నూతన నియమకాలు చేపడుతున్న తరుణంలో జీరో సర్వీసుతో బదిలీలు నిర్వహిస్తే కొందరికైనా న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్



నిరసన తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. శనివారం అనంత పురంలోని నారాయణ స్కూల్‌లో చోటు చేసుకున్న సంఘటనకు నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపు నగర కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అనంతపురంలోని సోమలదొడ్డి దగ్గర ఉన్న నారాయణ బాయ్స్ క్యాంపస్‌లో ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న టి.చరణ్ అనే విద్యార్థి కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థిని నిలబెట్టారని, విద్యార్థి మనస్థాపానికి గురై 3వ అంతస్తు నుంచి దూకి మరణించడం బాధాకరమన్నారు. విద్యార్థికి మరణానికి కారకులైన నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కడప నగర అధ్యక్ష, కార్యదర్శులు జాలా సుమంత్, మోహన్, ఉపాధ్యక్షులు వంశీ, అంజి రెడ్డి, చరణ్, నిరంజన్, శివ,ఉదయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

దేశంలోనే అగ్రగామిగా ఎపి

ప్రజాశక్తి - కడప అర్బన్ : దేశంలో ఎపిని ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక అభివృద్ధి రంగాలలో అగ్రగామిగా నిలిపే ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు తెలిపారు. ఆపార్టీ బిసి సెల్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదాసు మాట్లాడుతూ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, గుగుల్, అమేజాన్, విశాఖ రైల్వే జోన్, అమరావతి రాజధాని నిర్మాణం ద్వారా రాష్ట్రంలో తీసుకు రావడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. లోకేష్ విద్యా శాఖ మంత్రి గా సమర్ధ వంతమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో బిస సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, మాజీ సైనికుడు పాల్గొన్నారు.

కువైట్‌లో కష్టాలు పడుతున్న మహిళకు చేయూత

ప్రజాశక్తి- కడప అర్బన్



కుటుంబ సభ్యులతో బాధిత మహిళ

ఉపాధికోసం కువైట్ కు వెళ్ళి కష్టాలుపడుతున్న మహిళను వారి కుటుంబసభ్యుల వద్దకు చేర్చారు. ఎన్ఆర్ఐ టిడిపి ఉపాధ్యక్షులు రహమతుల్లా. కడప నగరానికి చెందిన కుమారి ఇక్కడ ఏజెంట్ల మాయమాటలు నమ్మి తన కుటుంబ పోషణ కోసం కువైట్ వెళ్లింది. అక్కడ వాళ్ళు పెట్టే బాధలు భరించలేక, రెండు కాళ్ళకు సర్జరీ కావడంతో అక్కడ పనిచేయలేక నానా కష్టాలు పడుతూ ఉండేది. చివరకు ఆత్మహత్యే శరణ్యం అని బాధపడుతున్న తరుణంలో వారు కుటుంబం సభ్యులు కడపలోని ఎన్ఆర్ఐ టిడిపి కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా ఇక్కడ ఏజెంట్‌తో, అక్కడున్న సేట్‌తో, బాధిత మహిళతో మాట్లాడారు. మహిళను సురక్షితంగా భారతదేశానికి రప్పించి కడపలోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధ్యత మహిళా కుటుంబ సభ్యులు ఈ సమస్యను తక్షణమే తీర్చిన ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ విప్, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మసాపేట శివ, బెస్త సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి రాంప్రసాద్, 4వ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జి ఆవుల వెంకటేష్, నాయకులు నరసింహ, ఇర్ఫాన్ కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కడప : కడప నగరంలోని ఎంఆర్ స్ట్రీట్ మేదర వీధిలో వెలసిన సయ్యద్‌షా నాదర్‌షా వలి ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని కడప మైనార్టీ నాయకుడు సుభాన్ బాషా పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి ఉరుసు ఉత్సవాల పోస్టర్‌లను శనివారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా సుభాన్ బాష మాట్లాడుతూ సయ్యద్ షా నాధర్ షా వలి గంధం ఫిబ్రవరి 1న నిర్వహించి అనంతరం మెరవణి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 2న ఉరుసు ఉత్సవాలను నిర్వహించనున్నారన్నారు, అలాగే రాత్రి ఖవ్వాలి పోటీలు జరుపుతున్నట్టు ఆయన తెలిపారు అలాగే 3న నాతీయ మెహఫిల్ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మొక్కుబడే!

ప్రజాదృష్టి

జిల్లాలో స్వర్ణాంధ్ర... స్వచ్ఛ దివస్ ప్రచారార్భటాన్ని తలపించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవలి మైదుకూరు పర్యటనలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని మొదటగా ప్రారంభించిన కడప జిల్లాలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రభావం గణనీయంగా కనిపించాలి. జిల్లా వ్యాప్తంగా అటువంటి ప్రభావం కనిపించడం లేదు ఎందుకని, అంటే స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ఉద్దేశం మంచిదే. ఆచరణే అధ్వానం అని గమనించాలి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణకు తగిన యంత్రాంగం ఏర్పాటు, నిధుల కేటాయింపు, ప్రతి రోజూ స్వచ్ఛత కార్యక్రమం మానిటరింగ్ కొరవడిన ఫలితమే మొక్కు బడితనానికి నిదర్శనమని భావించాలి. స్థానిక సంస్థలను బాధ్యులుగా చేసి చేతులు దులుపుకుంటే ఆశించిన ప్రయోజనం నెరవేరదనే సంగతిని గ్రహించాలి. సాధారణంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో చివరి అంచెలైన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీ ల్లో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులతోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి బాధ్యులుగా చేయడం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించలేమనే సంగతిని గ్రహించాలి. మానవునిలోని శరీరం, మెదడు, మనసు, ఇళ్లు, పనిప్రదేశాల్లో శుభ్రత పాటించడం వంటి సూత్రాలను వల్లించడం వరకు బాగానే ఉంటుంది. వాటిని అమలు చేయడానికి పకడ్బందీ ప్రణాళికను అమలు పరచాల్సి ఉంది. ప్రపంచంలోనే ఎక్కువ జనసాంద్రత, ఎక్కువ నిరక్షరాస్యత కలిగిన దేశంలో పంచ సూత్రాలను అమలు చేయడం, అద్భుత ఫలితాలను సాధించడం ఆషామాషీ వ్యవహారం కాదనే సంగతిని గ్రహించాలి. ఇటువంటి కార్యక్రమాలను తీసుకోవడం ప్రచారం చేసుకో వడం వరకు పర్వాలేదు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మానవుని జీవనంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా భావించే వరకు పటుతర సమర్ధ ప్రణాళిక ద్వారా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి. జపాన్, సింగపూర్ వంటి జనాభా తక్కువ, అక్షరాస్యత రేటు ఎక్కువ కలిగిన నాగరిక దేశాల్లోనే సాధ్యం. పేదదేశాల జాబితాలోని ఇండియాలోనూ, ఇందులోనూ లిటరసీ రేటులో అట్టడుగు వరుసలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అద్భుత ఫలితాలను ఆశించడం అత్యాశే అవుతుందని చెప్పకోవచ్చు. నిధుల కేటాయింపును, చేతలను విస్మ రించడం ద్వారా పరిశుభ్ర, ఆరోగ్యవంతమైన సమాజంగా ఎదగాలని ఆశించొచ్చు. ఆచరణలో ఆశించిన ఫలితాలను సాధించడం ఇప్పట్లో సాధ్యం కాదనే క్షేత్రస్థాయి వాస్తవాల్ని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆచరణ సాధ్యం కాదని విస్మరించడం తగనిపని. దానికి తగిన ప్రణాళిక, పకడ్బందీ అమలుకు తగిన మానవ వనరులు, నిధులు, నిరంతర పర్యవేక్షణ వంటి సమర్థ యంత్రాంగాలను ఏర్పరచడం ద్వారా సాధించడం సాధ్యమేనని గ్రహించాలి. దీనికి చిత్తశుద్ధి, దృఢసంకల్ప బలంతో కంకణబద్ధులం కావాలి మరి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముమ్మరంగా వేరుశనగ నూర్పిడి



యంత్రంతో పంట నూర్పిడి చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట నూర్పిడిని రైతులు ముమ్మరం చేశారు. మండలంలోని వెదురూరు, రాజుపాలెం, నరహరిపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో సుమారుగా 2వేల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పూర్తి కావడంతో నూర్పిడి చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు నూర్పిడి పనులు పూర్తయ్యాయి. కొంత మంది రైతులు కూలీలతో నూర్పిడి పనులు చేయిస్తుండగా, మరికొంతమంది కూలీలతో వేరుశనగ పంటను పీకించి తర్వాత యంత్రాల ద్వారా కాయలను నూర్పిడి చేయిస్తున్నారు. ఎకరా పంట నూర్పిడి చేసినందుకు యంత్రానికి రూ.6వేలు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పంట పూర్తిగా నూర్పిడి చేసేందుకు రూ.13వేలు ఖర్చవుతుందని అంటున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉందని, ఎకరాకు 20 నుంచి 25 బస్తాల వరకు దిగుబడి వస్తుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఎకరా వేరుశనగ పంట సాగుకు ఎరువులు, మందులు నూర్పిడి వరకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం బస్తా ధర రూ.2,500 నుంచి రూ.2,700 వరకు పలుకుతున్నాయి. చాలా మంది రైతులు పంట పొలాల్లో వేరుశనగ కాయలు తూకాలు వేస్తున్నారు. వేరుశనగ పంట నూర్పిడి చేసేందుకు కూలీల కొరత అధికంగా ఉండడంతో పక్క మండలాలు చెన్నూరు, మైదుకూరు, ఖాజీపేట ప్రాంతాల నుండి ఆటోలలో పిలిపించుకుంటున్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేరుశనగ పంట నూర్పిడి చేసినందుకు రూ.300 ఇస్తూ.. ఆటో బాడుగ కూడా రైతులు వెచ్చిస్తున్నారు. ఈ ఏడాది వేరుశనగ సాగుతో మంచే జరిగిందని, అయితే చాలా వరకు సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. దళారులు ధరల్లో వ్యత్యాసం ప్రదర్శిస్తూ రైతులను దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.



వేరుశనగ కాయలు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మానవహారంలో ఆర్‌డిఒ, అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతి ఒక్కరూ తమకున్న ఓటు హక్కును వివిధ స్థాయిల్లో జరిగే ఎన్నికలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ ఆదిమూలపు సాయిశ్రీ కోరారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోజనులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మొదటి పునాది అన్నారు. అంతకుముందు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి, తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ వివేకానంద రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శివప్రసాద్, ఆర్‌ఐ సతీష్, మండలస్థాయి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దనూరు : ఓటు ప్రతి పౌరుని హక్కు అని.. ఆ హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ దాన్ని వినియోగించుకోవాలని తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది ఆకాంక్ష, శివ జ్యోతి, తేజస్విని, వరలక్ష్మి, తులసి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని తహశీల్దార్ శోభన్‌బాబు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అర్జున్, ఉపాధ్యాయులు చంద్రఓబులరెడ్డి, టిడిపి నాయకులు చాంద్‌బాషా, సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

అపరిచిత ఫోన్ కాల్స్ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, సెక్యూరిటీ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ ఉమాదేవి పేర్కొన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్స్ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో సైబర్ క్రైమ్స్ నేరాలు అధికమవుతున్నాయన్నారు. వాటిపట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకొని తగిన జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక పరిజ్ఞానం చాలా ముఖ్యమన్నారు. పొదుపు-ఖర్చులు క్రమ పద్ధతిలో పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ నవనీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు చాలా ప్రమాదకరమైనవని, విద్యావంతులు కూడా ఈ నేరాల బారిన పడడం విచారకరమని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కెవిఎస్ రూరల్ మీడియా కళాకారుల బృందం సైబర్ నేరాలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెర్డ్స్ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, ఇందిరమ్మ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

జూదం అరికట్టకపోతే దీక్ష చేస్తా : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో జూదం అరికట్టకపోతే దీక్ష చేస్తానని మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్‌పిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్‌కు, ప్రొద్దుటూరు డిఎస్‌పిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన భావనకు స్వాగతం పలుకుతూ ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యక్రమాలు నియంత్రించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన చేశారు. 2019-24 మధ్యకాలంలో జగన్ హయాంలో పేద కుటుంబాల సంక్షేమాన్ని కోరి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని క్లబ్‌లు మూతపడ్డాయన్నారు. 15రోజుల నుండి పేద కుటుంబాల బారిన మహమ్మారిగా మారిన జూదం జోరుగా సాగుతోందన్నారు. ఎమ్మెల్యే వరద వత్తిడితో స్థానిక పోలీసులు మౌనం దాల్చుతున్నారని ఆరోపించారు. గతంలో అనుమతించని పోలీసులు ఇప్పుడెలా అనుమతించారని ఆయన ప్రశ్నించారు. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించని పక్షంలో మరో పత్రికా ప్రకటన చేస్తామని, అప్పటికీ పరిస్థితిలో మార్పురాకపోతే జార్జి కారొనేషన్ క్లబ్ ఎదురుగా గాంధేయ మార్గంలో దీక్ష చేస్తానని రాచమల్లు స్పష్టం చేశారు. అంతకు ముందు నియోజకవర్గ గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడుగా తనను నియమించినందుకు ఉప్పర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర మురళీధర్ రాచమల్లుకు బొకే ఇచ్చిన కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి ఇచ్చిన ఈ పదవికి సంపూర్ణంగా న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్-ఛైర్మన్ అయిల్‌మిల్ ఖాజా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలి

- మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ రామ సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ఎన్నికల ముందు చెప్పిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని మైదుకూరు నియోజకవర్గ ఆ పార్టీ కో-ఆర్డినేటర్ చాపాటి రామ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి 7 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సంక్షేమ, పెన్షన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలను అమలు చేయలేదన్నారు. కమిటీలతో, ప్రణాళికలతో కాలయాపన చేస్తున్నారన్నారు. ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ అని బాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా మూలన పెట్టారన్నారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని, లేదంటే ప్రజా ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు.

భారీ జాతీయ జెండాతో ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

శ్రీ వెంకటేశ్వర బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. 400 అడుగుల జాతీయ జెండాను కళాశాల విద్యార్థుల చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి గీతాలతో వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేస్తూ పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ దుగ్గిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అమలుకు పాటు పడాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రాజ్యాంగం అమలుకు ప్రతి ఒక్కరు పాటు పడాలని ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ప్రతాపరెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఇండియా చిత్ర పటం ఆకారంలో అలరించారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడతామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ దివిజా

అక్షరాస్యత సాధనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

అక్షరాస్యత సాధనే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ దివిజా సంపతి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఉల్లాస్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోజనులైన నిరక్షరాస్యుల్లో అక్షరాస్యత శాతాన్ని పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం శైలజ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు : నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేసి విద్యావంతులను చేయాలని ఎంపిడిఒ అలవలపాటి ముకుందరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ భవనంలో శనివారం ముకుందారెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, వెలుగు విఒఎలు, అంగన్వాడీ కార్యకర్తలకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులైన యువతీ, యువకులు, వృద్ధులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దాలన్నారు. రోజుకు ఒక గంట చదువు నేర్పించి విద్యావంతులను చేయాలని కోరారు. అనంతరం క్యాలెండరు ఆవిష్కరించి, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగం, సూపర్‌వైజర్ ఉమారాణి, ఈఓపిఆర్డీ వీరభద్రుడు, ఉల్లాస్ సూపర్‌వైజర్ జయచంద్రారెడ్డి, వెలుగు సిసిలు పాల్గొన్నారు.

వేముల : ఎంపిడిఒ కార్యాలయంలో వయోజన విద్య వాలంటీర్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌లకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 480 మంది డ్వాక్రా మహిళలు వయోజన విద్య నేర్చుకొనుటకు ఆసక్తి చూపారని తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్య వాలంటీర్లు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



తోస్తున్న ప్రయాణికులు, స్థానికులు

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్టార్టింగ్ సమస్యతో ఆర్‌టిసి బస్సు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రయాణికులు, ప్రజలు కలిసి బస్సును తోశారు. వివరాల్లోకి వెళితే.. తాడిపత్రి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు తాడిపత్రి నుంచి ముద్దనూరు మీదుగా ప్రొద్దుటూరుకు తిరుగుతుంది. ప్రొద్దుటూరు నుంచి తిరిగి తాడిపత్రి వెళ్తూ శనివారం ముద్దనూరు పాత బస్టాండ్‌కు చేరుకుంది. అనంతరం బస్సు స్టార్ట్ కాకలేదు. దాదాపు 30నిమిషాలుపైన బస్సు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నాళ్లీ మూల పడిన బస్సులను తిప్పుతూ డ్రైవర్లను, ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు న్యాయం జరిగేలా పోరాటాలు

- రైతు విభాగ మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగిరెడ్డి నియామకం

ప్రజాశక్తి - ఖాజీపేట



వైసిపి తరపున రైతులకు న్యాయం జరిగేలా పోరాటాలు చేస్తామని మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు జి.నాగిరెడ్డి తెలిపారు. పార్టీ మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులుగా జి.నాగిరెడ్డిని నియమించిందని, ఆ మేరకు ఆదేశాలు అందాయని వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం జి.నాగిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తన నియమకానికి సహకరించిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్ర నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. అందరి సహకారంతో రైతులకు సేవలు అందిస్తానని నాగిరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికా వొస్తున్నా ఇంతవరకు రైతులకు అందించాల్సిన రైతు భరోసా నగదు మొత్తాన్ని జమ చేయలేదన్నారు. ఇది రైతులను వంచించడమేనని నాగిరెడ్డి అన్నారు. పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పోరాటాలకు సిద్ధపడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.



భాస్కర్‌కు కండువా కప్పుతున్న మంచ నాగమల్లేశ్వరి

జాతి బలోపేతానికి కృషి : భాస్కర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దళిత వర్గాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాటుపడుతూ, జాతి బలోపేతానికి కృషి చేస్తానని పివి రావు మాల మహనాడు జిల్లా అధ్యక్షులు జేష్టాది భాస్కర్ పేర్కొన్నారు. పివి రావు మాల మహనాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ఆదేశాల మేరకు విజయవాడ మినర్వా గ్రాండ్‌లో జాతీయ మహిళ అధ్యక్షురాలు మంచ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో తనను జిల్లా అధ్యక్షులుగా నియమించారని, ఆ మేరకు నియామక పత్రాన్ని అందజేశారని భాస్కర్ తెలిపారు. తనను నమ్మి 30ఏళ్ల చరిత్ర కలిగిన పివి రావు మాల మహనాడులో జి చెన్నయ్య, మంచ నాగ మల్లీశ్వరి ఎన్నుకున్నందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గూడం చెరువు సంపత్ కుమార్, శ్రీపతి భాస్కర్ పాల్గొన్నారు.

నేడు పలు విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణంలో ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్, పొట్టి శ్రీరాములు, యోగివేమన విగ్రహాలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆవిష్కరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాయల్ కూడలిలో ఏర్పాటు చేసిన 101 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హెల్మెట్, సీటు బెల్టు తప్పక ధరించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకుని వాహనాలు నడపాలని ఎంవిఐ వెంకటప్రసాద్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ఎంవిఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ సిఐ హాజీవల్లి, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్.జయమ్మ వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



జయమ్మకు నివాళులర్పిస్తున్న వైఎస్ కుటుంబ సభ్యులు

దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తల్లి వైఎస్ జయమ్మ వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల దారిలో ఉన్న జయమ్మ సమాధి వద్ద మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, వైఎస్ జార్జిరెడ్డి, సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ సుధీకర్ రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైఎస్ సౌభాగ్యమ్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అదుపుతప్పి లారీ రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టి, బోల్తా పడింది. శనివారం తెల్లవారుజామున మండల పరిధిలోని యర్రిపల్లె దగ్గర ప్రకాశం జిల్లా గురజాల నుంచి సత్యసాయి జిల్లా మడకశిరకు వెళుతున్న బియ్యం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. పులివెందుల నుంచి వెళుతున్న మోటార్ వెహికల్ అడ్డు రావడంతో తప్పించబోయి బోల్తా పడింది. లారీలో 26కిలోల బస్తాలు 962 ఉన్నాయి. కరెంటు పోల్‌కు ఢీకొనడంతో అది విరిగి లారీపై పడింది. వైర్లు కిందపడ్డాయి. ఎలాంటి ప్రమాదం జరగలేదు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : కామనూరు పిహెచ్‌సి పరిధి నరసింహపురంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, డిపిఎంఒ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం కుష్టు వ్యాధి కేసు నిర్ధారించు సర్వే కార్యక్రమంపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు, కను బొమ్మలు, కను రెప్పలు రాలి పోవడం, కాళ్లు చేతులు తిమ్మిరులు, తెలియకుండానే బొబ్బలు రావడం, అరచేతిలో, అరి కాళ్ళలో స్పర్శ కోల్పోవడం, చేతి వేళ్ళు, కాలి వేళ్ళు వంకరులు తిరిగి అంగవైకల్యం రావడం కుష్టు వ్యాధి లక్షణాలన్నారు. వీటిని త్వరగా గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బిఎ వర ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, సిహెచ్ఒసంధ్య, ఎఎన్ఎం ప్రమీల, ఆశాలు మేరీ, రాధిక పాల్గొన్నారు.



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న రమణారెడ్డి

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమణారెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.రమణారెడ్డి కోరారు. మండలంలోని ఖాదర్‌పల్లి గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను జిల్లా వ్యాప్తంగా పశు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చాపాడు పశువైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ గౌస్, విఎల్ఒ వెంకటేశ్వర్లు, జెవిఒ చలపతి, ఖాదర్‌పల్లి పశువైద్య సహాయకురాలు విష్ణుప్రియ, మహబూబ్ హుస్సేన్, దస్తగిరి, అమర్నాథ్, సిబ్బంది రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : పశు ఆరోగ్య శిబిరాల్లో పశువులు, గొర్రెలు, మేకలకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. కొర్రపాడు గ్రామంలో శనివారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1నుంచి మూడు రోజులపాటు నెల్లూరు పట్టణంలో జరగనున్నాయని, జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్ కోరారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆటోస్టాండ్‌లో శనివారం మహాసభలకు సంబంధించిన గోడ పత్రాలను ఆటో డ్రైవర్లు, కార్మికులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రామయ్య, ఈశ్వరయ్య, నరసింహులు, చంద్ర, రమణయ్య, చాంద్ బాషా, తిరుపాల్, సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారానికి ప్రభుత్వం సిద్ధం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇప్పటికే పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలతో కునారిల్లిపోతున్న పేద ప్రజలపై స్మార్ట్ మీటర్ల ముసుగులో మరోసారి భారాలు మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ప్రజలు ఇలాంటి మోసపూరిత చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ హెచ్చరించారు. స్థానికంగా ఉన్న అంగళ్లకు శనివారం స్మార్ట్ మీటర్ల బిగింపును సత్యనారాయణ అడ్డుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్‌ను ఈ రోజు ఉచితంగా బిగిం చేసి తర్వాత 90నెలల వరకు ఈ మీటర్ ఖరీదు బిల్లులో పొందు పరుస్తూ ప్రజలపై భారాలు వేసేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇలాంటి ప్రమాదకరమైన ప్రభుత్వ ఆలోచనను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రజలు కూడా స్మార్ట్ మీటర్ల బిగింపును తిరస్కరించి, వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంత కుమార్ ఆధ్వర్యంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య. మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం బాలికలకు మలేరియా, డెంగీ, చికెన్‌గన్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, సురేష్, ఆరోగ్య కార్యకర్తలు ప్రేమలత, సావిత్రి, ఆశా కార్యకర్త సావిత్రి. ప్రిన్సిపల్ హరిత, సుష్మ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో సాయిస్వర్ణ ఏకో బాగ్స్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. యజమాని ఎన్.ప్రతాప్ రెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. శనివారం కట్టెల బ్యాగు ఫ్యాక్టరీలో షార్ట్ సర్క్యూట్‌వల్ల అగ్నిప్రమాదం జరిగింది. దాదాపు రూ.6 లక్షల వరకు నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. స్థానిక అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో కొంతమేర నష్టం తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్, లీడింగ్ ఫైర్‌మాన్ ఖాసిం వల్లి, ఫైర్‌మాన్లు రాజశేఖర్‌రెడ్డి, హెూంగార్డు సాయి పాల్గొన్నారు.

బూడిద అధికలోడు వేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపి నుంచి బూడిద తరలించే క్రమంలో అధికలోడ్ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నరేష్ బాబు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస స్టేషన్లో టిప్పర్లు, లారీల యజమానులు, హిటాచి, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సిమెంటు పరిశ్రమలకు, ఇటుకల పరిశ్రమలకు బూడిద తరలించే క్రమంలో అధికలోడు వేయడం వల్ల రోడ్డుపై పడుతుందని తెలిపారు. దుమ్ము లేవడంతో ఆ దారిలో తిరిగే వారు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పట్టణంలో, గ్రామాలలో లారీలు వేసిన దుమ్ము వలన ప్రజలు తమకు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. వేగంగా వెళ్లరాదన్నారు. డ్రైవింగ్ పట్ల కౌన్సెలింగ్ ఇచ్చారు.

బిటెక్ రవికి చిత్రపటం బహూకరణ

వేంపల్లె : పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డికి మైనార్టీ నేతలు ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. శనివారం వేంపల్లె మండల మైనార్టీ కార్యదర్శి సయ్యద్ పీరా సాహెబ్ తన అనుచరులతో బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేంపల్లెలో ఉన్న మైనార్టీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయించాలని కోరారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ నాయకుల అభిమానాన్ని తాను మరిచిపోనని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లింగాల : లింగాల జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా విద్యార్థులకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి, మందులను అందజేశామని మండల వైద్యాధికారిని సుభాషిణి తెలిపారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం విద్యార్థులకు ఓ వరమన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివరాం, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రమేష్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల విద్యాసహాకులు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.